# పలకరించిన అందాలు

"రమణశ్రీ"

ఆవిడ మాట్లాడుతోంది . . జడివాన . . . ఆలజడి
జవాన . . . నిశ్శబ్దంగా వింటోంది ప్రకృతి . . .
మధ్య మధ్య చమక్కులు విసురుతోంది. యౌవనపు వేడిచల్లారినగాలి ముసురుతోంది. కార్మొయిలు తరగల కళ్ళల్లో మెరుపులవర్షం. ఆగని వేగంలో జీవితాంతాల్లోంచి పొంగినహర్షం. చీకటినించీ, చీకునించీ, దాటి వెలుగువాక పెదవుల అంచుల్ని స్పర్శిస్తూ మాట్లాడుతోంది.

ఆవిడమాట శిశునిద్రకు జోలపాట . .
ఆదికవిత్వం గుండెల్లోంచి పొంగిత్తిన సత్యం . .

ఆ నుడి కారపు సొంపుల్లో పెదవులు పలకరించిన వంపుల్లో . . సత్యంగోచరిస్తుంది . . . ఆవిడబ్రతుకు నిద్రలో కలల అలలు చెలరేగిన పయనం . . ఆద్యంతం శయనించిన పయనం . .

ఆ ప్రవాహం ఆవేగం.. ఆవేశం . .
నిశ్శబ్ద వీచికలా వింటున్నా–
స్తబ్ధిరాత్రిలో వెలుతురు కంటున్నా–

అతనూ ఇతనూ అనే అరమరిక లేకుండామాట్లాడుతోంది..ఎదిరించిన అశక్యంతో పోట్లాడుతోంది.

ఆవిడ పేరు సత్యవతి. అహం బ్రతుకంతా సత్యవ్రతి? మధ్యమధ్య "వినండీ . . వినండి! . . అదిగో! మీరువినరూ? నాలోకాన్ని కనరూ? అదికాదండి! మీరు వినలేరు . . నవ్వు . . నవ్వుతున్నారు! నా బతుకు నవ్వులపాలే! నవ్వండి నవ్వండి! . ."

ఇదంతా నిజం! నాదంతా ఒకరకం ఇజం! వినకేం? వింటున్నా కథనసత్యాన్ని కంటున్నా. జీవితస్వప్నాన్ని కంటున్నా . . .

ఆవిడ వాక్కుల్లో వాస్తవం గవేషించి, ఆవిడ పెదవుల్లోంచి గుండెలోప్రవేశించి, నిద్రమైకంలో తూగుతూ జోగుతూ . . . ఆ మాటలు సంగీతశ్రుతిలయరాగాలై, అన్యోన్యం ప్రణయించుకొన్న అనురాగాలై, నా మానసికశక్తుల్ని జోకొడుతున్నై, నా అహంకారాన్ని అకడుతున్నై . . .

అది ఉపన్యాసం! మధురావహ మంజీరస్వన నృత్యత్పద విన్యాసం! . .

అందులో మాతృదేవి బిడ్డని జోకొట్టి నిద్రింపించే లాలన . . . ప్రేయసి ప్రియుణ్ణి పలకరించే లాలస . అక్క సోదరుణ్ణి అలరించే ఔదార్యం.. మాదృశ అల్పజీవులకు శిరోధార్యం.

ఆవిడ నాకేమీ కాదూ?
ఏవిధ అనుబంధం లేదూ?

ఈ ప్రకృతి వైవిధ్యం అనుభవిస్తున్నాను. ఆమె మాటల అందాల్లో, పలుకుబడి సొంపుల్లో, పలకరించిన పెదవుల వంపుల్లో.

కొంతసేపటికి ఆవిడ దాహంతో ఆగింది. ఆ ఆగడంలో–ప్రాతస్సులు మేల్కొన్న చప్పుడు, భగభగమండే సంధ్యమీద నీరు చిలికిన చప్పుడు, ప్రకృతికాంత పులకరించి,కనులప్పళించినచప్పుడు,



యౌవనంలో నెత్తురు మండి నరాలు
జడిసినచప్పుడు.

ఆవిడ పెదవులు భాషా సౌందర్య ప్రవాహాలకి తలుపులు వేస్తూ, శాశ్వతంగా చిరునవ్వు నవ్విన రేఖలో నిట్టూర్చింది.—

ఆ నిట్టూర్పుల ఆ విరులూ
వయస్సు బరువుల క్రొవ్విరులూ

కొనసాగిన సౌందర్యపు పయనంలో, మాట్లాడిన అలసటల్ని, అధరం క్రింద వంపుతో కలుపుతూ, ముంగురులతో జాలిగా పలకరించింది.

"దాహం" అంది.

ఆ దాహంలో దాహం, అనునయ ప్రణయ స్నేహం, "దాహం, స్నేహం, స్నేహదాహం" నవ్వింది తను వేసిన ప్రాసకి, తనలో రేగిన ఆశకి!

ఆమె మాటల్లో స్వేచ్ఛా ఛందస్సులు,
యతిప్రాసల సౌందర్యపు అంతస్సులు,
"చుట్టరికం గొప్పదెలా?, చనువూ స్నేహం
కనపడలా?"

ఈ నీతి రీతి, అంతర్జాతీయ ప్రఖ్యాతి, ప్రపంచానికి ప్రశాంతి. ఆ ప్రవాహంలో, పలుకుల సుడులలో, స్నేహదాహం, దాహశాంతి!

ఆవిడ భాషాసౌందర్య ప్రవాహానికి తలుపులు వదిలివిడినయ్! పెదవుల్ని సంధ్యలో తడుపుతూ పలకరించింది.

"ఇంత సౌందర్యాన్ని, వదిలివేశారు! ఇది విన లేదూ, మీరు? సిగ్గుచేటు నగుబాటు నవ్వలేకుం డున్నా"—నేనువిన్నా నేనువిన్నా ఆవిడ భర్త విడాకులిచ్చాడని వదలివేశాడని,

అంతే! నిజమంతే!

పాపం శమిస్తుంది! లోకం హసిస్తుంది!

సంస్కారం సహిస్తుంది! జీవితం వహిస్తుంది!

ఆవిడలో సత్యం గోచరిస్తుంది. ఇకనిత్యం ఏమాచరిస్తుంది?

లేవబోయాను నేను వెంటనే!

అడ్డగించిందామె వెనువెంటనే!

"నేను మీ పురుషులమీద అభాండాలు వేయను" హేమాహేమీలుకూడా ఇవ్వలేని హామీ... ఎవరికీ లేనంత ధీమా... ఆర్థిక ప్రతిపత్తి కోసం చేసుకొన్న భీమా...

"ఇంకా ఇది నాకు జీవితంలో కామా... ఒక్కసారే పులిస్టాపు..."

ఆత్మహత్య!... ఆత్మహత్య!... కలలో కలవరింతల్లా, ప్రకృతి లోపల వరింతల్లా...చెవుల్ని దూసుకుపోతున్నయ్!

"నాకేనాడో, మగవాడిమీద నమ్మకం మళ్లి పోయింది" ఆ పాపం నాకెందుకు?... ఆ శాపం నాకెందుకు?

నేను నిద్రపోయేటపుడు ఆవిడ మెడలో మంగళసూత్రం కట్టించెవరో? ఆవిడ నిద్రపోయే టప్పుడు త్రెంచివేసిందెవరో? నాకెందుకు ఆ పాపం? నాకెందుకు ఆతాపం? ఇందులోదాగుంది రహస్యం. కాదు కానేకాదు, హాస్యం! అను నిత్యం. ప్రబలసత్యం. నీలిగా కనిపించి, మబ్బు రంగెక్కి, కాగ్నలుపు కలతలో కరిపోయేనిశలు. పసుపు నీరెండలో లీనమయ్యే దిశలు

"ఆయనకీ నాకూ చుక్కెదురు. అనుభవించరు ఆనందం కొల్లగొడతారు. నా అందం నా అందానికి అసూయ జ్వాలతో దహించుకుపోయే వారు, హింసించేవారు చదువూ, సంస్కారం ఉన్న పశువు. నేనాయన చేతుల్లో శిశువు.

పగ, పొగ, ఎందుకూ? ఎందుకూ?

పొగ కళ్ళల్లో అందాన్ని హత్యచేస్తుంది!

పగ గుండెల్లో గుణాన్ని కూల్చివేస్తుంది.

అతనికి సౌందర్యంమీద పగెందుకు? పగలు ప్రాచుపగలు. పగబట్టి, పౌరుషం ఉద్రేకించి, విషప్రయోగం.

"నిజంగా నమ్మండి! దినదిన గండం. విష ప్రయోగం. నదిలో షికారు... ఊళ్ళో పుకారు.

నా కళ్ళల్లో పొగ చిమ్ముతోంది.

ఆవిడ నిట్టూర్పులతో కమ్ముతోంది!

"డబ్బుతో ఆడవాళ్ళని తెచ్చి వెట్టి చాకిరీ, దరిద్రం సౌందర్యాన్ని మసిపూసింది. నా శరీరం శల్యం. నేను జీవచ్ఛవతుల్యం."

ఆవేశంతో సుళులుతిరిగింది.

దిగులుతో ఘొగులుతూ అంది.

కళ్ళనిండా నల్ల తెల్లని మేఘాలు. రసంనిండిన విషాదరాగాలు. ఆలోచనతో మనసులో రాజు కొన్న వేడి. పరువుపోయిన గుండెబరువు. దేన్ని చూచి, ఇంక మురుపు?

కను మేఘాల్లో వర్షించబోయే తొందర, కను రెప్పల అరవిరింపుల్లో చిందర. అన్నింటిని వ్యక్తా వ్యక్తం చేస్తూ, చేలాంచల చలనంతో కంటికింద అద్దుకొంది! ఎడ నెడ కరిగిన కనుగొలకుల్లో సౌంద ర్యం, కిందికి దిగజారుతూ, వ్యథతో, బాధతో చూపుల్ని ప్రసరిస్తోంది!

"మీకేం? మీరెన్నైనా చెపుతారు! ఇష్టం లేని కాపురం... ఎవరెక్కగలరా గోపురం?... మామీద ప్రయోగించే శాసనాల్ని మీరే సృష్టిం చుకొన్నారు! ఇదేనా మీ రాజ్యాంగం? ప్రజా స్వామ్యంలో ఏవి మా హక్కులు? అవసరమైతే రాజకీయం ఉపన్యసిస్తాను."

ఆవిడ గొంతులో ప్రవాహం గులకరాళ్ళ వంపుల్ని నున్నదీరుస్తోంది! కర్కశాన్ని కడిగి పారవేస్తోంది!

"లేవకండి! అప్పుడే లేచిపోతున్నారే? మీరు మాకెప్పటికన్నా బంధువులే! మాపాలిటి కరుణా సింధువులే! నన్ను పూర్తిగా వినండి! కర్తవ్యం ఉపదేశించండి!"

నాటలేని ఆజ్ఞాబద్ధత, ఆ మాటల్లో అనుబం

లేవబోయాను. కంఠం నవ్వుతూ శాసించింది! అందులో మృదుత్వం, పువ్వులు నలుగుతోన్న పేశలత్వం, మెత్తని పాశత్వం కట్టేసిన బంధన. నన్ను ముందంజల బంధాలై సాగనీయందే!

"ఎన్నాళ్ళని కాపురం? మీ కోరికల తీరికల కోసం మీరు మరొకర్ని ఆశ్రయిస్తే నేనూ ఆశ్రయిస్తా. నేను సహితం ప్రియుడికోసం గవేషిస్తా"

గణగణ జయఘంటలు కొట్టాక ఆగిన నిశ్శబ్దం శరీరాన్ని చీల్చి, రక్తం వాగులై వరదలై పారిన నిశ్శబ్దం. కంఠంలో ఊపిరాడక గిలగిల కొట్టుక మరణించిన నిశ్శబ్దం. ఆ మాటల వెనకాల, దాగున్న అగాధాల తలుపులు తెరుస్తూ అసత్య, అధర్మ కర్మక వాటాల్ని బద్దలుగొడుతూ, అజ్ఞాన తిమిర తరంగాల్ని వెలుగు కొరడాలతో తరిమేస్తూ, నిశ్శబ్దం తలుపులు తెరచి మాట్లాడింది.

నిలవలేకపోయాను.

నిలుచుండిపోయాను.

కుర్చీమీద కూలబడిపోయాను.

"మీరు గజిబిజిపడి సతమతమై పోయారల్లే వుంది! పాపం! కాఫీ త్రాగుదురుగాని."

నిర్వికారంగా నవ్వింది. గుండె లోతుల్లో ఘులఘుల ధ్వనిస్తూ నవ్వింది.

ఇంకా, వదినెగార్ని గురించి, గ్రంథం విప్ప బోతోంటే, నేను లేవబోయాను.

"నిజం నమ్మండి! ఆ వదినె కూడా అంతే? నా కళ్లు స్వయంగా చూచాయి, మొగుడంత మొగుడుంటె, పరాయి మగవాడితో"

లేచాను. వినలేని సత్తువతో.

"కాఫీ త్రాగండి!"

అడ్డంగా రెండు కనక హస్తాల ఘులఘులలు ఆహ్వానించాయి. కమ్మని కంఠం. కోయిల గొంతులో తొలగిన అవకుంఠన.

ఆ కంఠంలో ఈ బెడదలేం లేవు.

సెలయేటి నవ్వు లఘులఘులలు ఒరసిపారిన నురువుల జలజలలు ప్రశాంత వాతావరణంలో జాలిగా, హాయిగా ప్రకృతిని పలుకరిస్తూ వినిపించే గొంతు—

పెదవి చిరునవ్వు విరిసింది!

ఆ నవ్వులోనే కోటి నందివర్ధన పుష్పాలు గుతులు గుతులు విచ్చుకొన్నాయి. అధరాలు అమృతకలశాన్ని అందుకొన్నాయి మందార మకరంద మాధుర్యాలు తొణికిసలాడినయ్!

ఆమెలో ప్రమాదంలేని వాతావరణ సౌందర్యం.

"ఆవిడ మా చెల్లెలు"

ఆహాఁ ధన్యోస్మి! ధన్యోస్మి!

ఆవిడ మళ్ళీ ఉపన్యాస విన్యాస.

"ఎంతసేపే అక్కా! ఆయనకి విసుగా వుంటుంది! అంతా నీకర్మ!"

కర్మ! వేదాంతాన్ని పెదవుల తుదల్ని స్మరించి మాట్లాడింది కర్మ! కర్మ సిద్ధాంతంమీద యెంత నమ్మకం? ఆ చెల్లెలికి!

"వీరు మనకి బంధువులే! మనల్నొకసారి పరామర్శించడానికని వచ్చి నే చెప్పినదంతా నచ్చి"

"వరస?" గర్వం అహంకరించింది! నా వీపు చరిచింది అదృష్టం!

"ఏదోవంక ఒకవంక అక్కా తమ్ముళ్ళవరస. మరోవంక వదినా మరదులవరస"

"మీరీనాడిక్కడే వుండండి."

నేనుండలేను నేనుండలేను నాకు చాలాపనుంది ఇకలేస్తాను. ఇక్కణ్ణుంచి లేచిపోతాను. కాఫీ కప్పు అందించింది చెల్లెలు. . .

"చాలా మంచివారు."

"నేను చెప్పినదంతా విన్నారు."

"అప్పుడప్పుడొస్తూవుంటారుగా!"

"మేము చాలా బాగా బతికినవాళ్ళమే మాది హైక్లాసుకుటుంబమని మీకు తెలుసుగా?"

అవును తెలుసు తెలుసు మీది హైక్లాసు కుటుంబమే తల్లీ!

చరిత్రలకి ఘుడియపడేటట్టు లేదు!

"అరరే! వెళ్లిపోతున్నారా?

"మీ పేరు? మీ పేరు?"

ఆసారస్యం, సాహిత్యం క్షేత్రయ్యపదాల్లో త్యాగయ్య కృతుల్లో వుందేమో వెతకాలి! వెళ్ళాలి!

వాళువాళ్ల పిలుపులు వినిపించటంలేదు.

"రేపుంటే రండి రండి ఇంకావుంది ఇంకా వుంది ఇదింకా కామా, . . ."

ఆవ్యక్తి మధురిమలు గాలి అలసటగా మోసుకొస్తోంది. నేను వినలేకపోయాను! కొంతసేపటికి వాళ్ళూ అక్కణ్ణుంచి లేచిపోయుంటారు! ★